సాక్షి సిద్దిపేట

బుధవారం । 12 । జూన్ । 2024

తొలిరోజు అక్క క్లాసులో కూర్చున్న..



కలెక్టర్ వల్లూరు క్రాంతి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ''స్కూల్‌కు వెళ్లిన మొదటి రోజు నర్సరీ క్లాసులో కూర్చున్నట్టు గుర్తులేదు.. మా అక్క క్లాసులో తన పక్కనే కూర్చున్నా. రెండు రోజుల తర్వాత మా క్లాసులో కూర్చోవడం అలవాటైపోయింది. స్కూల్ ప్రారంభం కాగానే కొత్త పుస్తకాలు, నోట్‌బుక్కులు ఉండటంతో ఉత్సాహంగా వెళ్లేది. పైగా స్కూల్‌కు వెళితే ఫ్రెండ్స్ కలుస్తారనే ఆనందం ఉండేది. పాఠశాల ప్రారంభానికి కొద్ది రోజుల ముందే బుక్స్‌కు ర్యాపర్స్ వేసుకునేది..'' అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తాను పాఠశాలకు వెళ్లిన మొదటి రోజును గుర్తు చేసుకున్నారు. ''కర్నూలు జిల్లా కేంద్రంలోని కేసీ కెనాల్ వద్ద ఉన్న విశ్వభారతి పాఠశాలలో మొదట చదివా. రెండో తరగతి వరకు అక్కడే చదివా. తర్వాత మాంటిస్సరీ స్కూల్‌కు వెళ్లాను. 9, 10 తరగతులు భాష్యం స్కూల్‌లో చదువుకున్నా.. నేను ఎప్పుడు కూడా స్కూల్ వెళ్లనని అనేది కాదు. డిసిప్లేన్‌గా స్కూల్‌కు వెళుతుంటి.. ఆడుకునేందుకు వెళ్లేందుకు తొందరగా హోంవర్క్ పూర్తి చేసుకునేది.. గేమ్స్ అంటే నాకు ఎంతో ఇష్టం. నాన్న చెప్పకపోయినా హోంవర్క్ కంప్లీట్ చేసుకునేది'' అని తన చిన్ననాటి పాఠశాల అనుభవాలను నెమరేసుకున్నారు. విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని, బడీడు పిల్లలందరూ స్కూల్‌కు వెళ్లాలని కోరారు.





బుడి'బడి' అడుగులు

మధుర జ్ఞాపకాలు

- బడిబాట పట్టిన జ్ఞాపకాన్ని నెమరేసుకున్న ప్రముఖులు
- చదువుతోనే భవిష్యత్ అంటున్న ఉన్నతాధికారులు

తమ ఉజ్వల భవిష్యత్ కోసం వేసిన బుడిబుడి అడుగులవి. అమ్మా, నాన్న వేలు పట్టి బడికి తీసుకెళ్లగా.. అక్షర శ్రీకారం పెట్టిన రోజు అది. పాఠశాలకు తొలిఅడుగు.. జీవితంలో మరిచిపోలేని మధుర క్షణాలు.. ఎప్పటికీ గుర్తుండిపోయే తీపిజ్ఞాపకాలు. నేడు పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని పలువురు ప్రముఖులు తమ పాఠశాల తొలిరోజు జ్ఞాపకాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. వారి చిన్ననాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. బాల్యం అంటే బడి.. చదువుతోనే భవిష్యత్ అంటున్న ప్రముఖుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

మొదటి రోజు ఆటలతో గడిచిపోయింది



సిద్దిపేటకమాన్: స్కూల్ డేస్ చాలా సంతోషంగా గడిచాయని సిద్దిపేట ఏసీపీ జి.మధు తెలిపారు. చిన్నప్పటి నుంచి కష్టపడి చదువుకున్నానని, అమ్మ ప్రోత్సాహంతోనే పోలీసు అయ్యానని చెప్పారు. ఖమ్మం జిల్లా కొత్తగూడెం సొంతూరు. అమ్మానాన్న బాలమణి, నర్సయ్య. నాన్న సింగరేణి ఉద్యోగి. కొత్తగూడెంలోని రామచంద్ర హై స్కూల్‌లో నా పాఠశాల విద్య పూర్తి చేశాను. బడికి అన్నయ్య, అక్కయ్యలతో కలిసి వెళ్లేవాడిని. తొలి రోజు పాఠశాలలో తోటి స్నేహితులతో ఆట పాటలతో గడిచిపోయింది. ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నాను. మా గురువు కోటేశ్వర్‌రావు మ్యాథ్స్, ఇంగ్లిష్ బోధించేవారు. జీవితంలో పైకి రావడానికి ఆయన చెప్పిన మాటలు ఉపయోగపడ్డాయి. – జి.మధు, సిద్దిపేట ఏసీపీ

అమ్మానాన్నతో కలిసి వెళ్లా..



నర్సాపూర్: అమ్మానాన్నతో కలిసి తాను మొదటి రోజు పాఠశాలకు వెళ్లానని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. తమ పాఠశాల సెయింట్ ఆంటోని హైస్కూలు (సికింద్రాబాద్) ఇంటి నుంచి కొద్ది దూరంలోనే ఉండేదని చెప్పారు. మొదటి రోజు పాఠశాలకు వెళ్లినప్పుడు కొంత భయంగా ఉన్నప్పటికీ.. తర్వాత స్నేహితులు పెరగడంతో భయం పోయిందని ఎమ్మెల్యే తన బాల్య జ్ఞాపకాలను వివరించారు. ఉపాధ్యాయుల చొరవతో తమకు చదువు పట్ల ఆసక్తి, శ్రద్ధ పెరిగి పట్టుదలతో చదివామని వివరించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర ఆటలు ఆడించే వారని, మార్చ్‌ఫాస్ట్ చేయించే వారన్నారు. ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధతో పాటు పాఠశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వడంతో తాను వాలీబాల్ ఆడానని సునీతారెడ్డి గుర్తు చేశారు.

సునీతారెడ్డి, ఎమ్మెల్యే

నాన్న భుజంపై ఎత్తుకొని బడిలో చేర్పించారు



సిద్దిపేటరూరల్: మొదటి రోజు తన తండ్రి భుజంపై ఎత్తుకొని బడిలో చేర్పించారని, ఇది జీవితంలో మరిచిపోని రోజు అని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా అన్నారు. తమది కామారెడ్డి జిల్లా బిచ్కుంద గ్రామం. 1975లో తన విద్యాభ్యాసం మొదలైంది. మొదటిరోజు తన తండ్రి భుజంపై కూర్చొని బడికి వెళ్లిన విషయం ఇప్పటికీ గుర్తుందన్నారు. నాటి మొదటి అడుగు తనను ఈస్థాయికి తీసుకొచ్చిందని చెప్పారు. అప్పట్లో నా తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడుతూ తనను చదివించారని, వారి రుణం తీర్చుకోలేనిదన్నారు. అమ్మానాన్నల కృషికి వెలకట్టలేమని, ప్రస్తుతం వారు గర్వించే విధంగా ఈ స్థాయికి ఎదిగానని తన బాల్యస్మృతులను గుర్తు చేసుకున్నారు. బాల్యంలో ఎంతో ఇష్టంగా బడికి వెళ్లేవాడినని, చదువుతోనే జీవితం మారిపోయిందన్నారు. ఉపాధ్యాయులు, మిత్రులు ఎంతో సహకరించారని జయదేవ్ ఆర్యా అన్నారు.

జయదేవ్ ఆర్యా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

నాడు బడికి వెళ్లడమే గొప్ప



హుస్నాబాద్: ''నా చిన్నతనంలో మనసు పెట్టి బడికి పోవడమే గొప్ప.. నేల మీదనే కూర్చునేవాళ్లం. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను'' అని హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి అన్నారు. తమది పూర్వపు వరంగల్ జిల్లా ఎనగుర్తి మండలం చిన్నవల్బాడు గ్రామం అని, అక్కడే టెన్త్ వరకు చదువుకున్నానని తెలిపారు. నాటి బడులకు, నేటి బడులకు ఎంతో తేడా ఉందన్నారు. పాఠశాలకు తొలిరోజున నాన్న కొమురయ్యతో కలిసి వెళ్లాను. ఉపాధ్యాయులు చొరవతోనే నేడు ఈ స్థాయికి చేరుకోగలిగాం అని ఆర్డీఓ తన బాల్యస్మృతులను వివరించారు. పాఠశాలలో ఇప్పటిలాగా బెంచీలు, డ్యూయల్ డెస్క్‌లు ఉండేవి కావు, కటిక నేల పైనే చదువుకునే వాళ్లం. 9వ తరగతి నుంచి మ్యాథ్స్‌పై శ్రద్ధ పెట్టాను. ప్రభుత్వ పాఠశాలల్లోనే అప్పట్లో సోషల్ అవేర్నెస్ ఉండేదన్నారు. – రామ్మూర్తి, ఆర్డీఓ

మారం చేస్తే కొట్టిండు..



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ''నేను స్కూల్‌కు పోయిన మొదటిరోజు మా నాన్న రమణయ్య దించి వచ్చినట్లు గుర్తుంది. తర్వాత నేను స్కూల్‌కు వెళ్లనని ఏడిస్తే సర్ది చెప్పారు. మారం చేస్తే ఒకసారి కొట్టిండు కూడా.. నేను చిన్నప్పటి నుంచి స్కూల్‌కు రెగ్యులర్‌గా వెళ్లేవాడిని. మాది కరీంనగర్ జిల్లా హసన్‌పర్తి. మా ఇంటికి దగ్గరలో ఆర్యసమాజ్ స్కూల్ ఉండేది. నా ప్రాథమిక విద్య ఈ ప్రైమరీ స్కూల్‌లో జరిగింది.. హాలిడేస్ తర్వాత స్కూల్ పోవాలంటే బాధగా అనిపించేది. సెలవుల్లో ఆటకు అలవాటు పడిన తర్వాత స్కూల్ వెళ్లాలంటే కొంచెం ఇబ్బందిగా ఉండేది..'' అని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్ తన పాఠశాల తొలి రోజులను గుర్తు చేసుకున్నారు. ''బడీడు పిల్లలందరు బడిలోనే ఉండాలి.. ప్రతి ఒక్కరు చదువు కోవాలి. కష్టపడి చదువుకుంటేనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు.. నేను చిన్నప్పటి నుంచి కష్టపడి చదివాను.. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలిగాను..'' అని పేర్కొన్నారు.

– చెన్నూరి రూపేష్, ఐపీఎస్, సంగారెడ్డి ఎస్పీ

మొదటి రోజు భయమేసింది



కొడిపల్లి(నర్సాపూర్): పాఠశాలకు నాన్నతో కలిసి వెళ్లా. మొదటి రోజు భయమేసింది అని హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మాది భూస్వామి, రాజకీయ అనుబంధం ఉన్న పెద్ద కుటుంబం. గ్రామంలో ఉంటే పిల్లలు చదువుకోరని మా నాన్న చిలుముల శేఖరెడ్డి నన్ను హైదరాబాద్‌లోని సెంట్ ఆన్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించారు. మొదటి రోజు స్కూల్‌లో చేర్పించినప్పుడు భయమేసింది. అక్కడి నన్స్ పిల్లల పట్ల ఎంతో ప్రేమగా ఉంటూ సేవ చేసేవారు. వారి సేవాదృక్పథం నన్ను ఇంటిని మరిచిపోయేలా చేసింది. ఆమె చెప్పిన ప్రేమ, దయ, జాలి, కరుణ క్రమశిక్షణ ఇప్పటికీ మర్చిపోలేను. ప్రాథమిక విద్య దశలో నేర్చుకున్న సేవాభావంతో వారి అడుగు జాడల్లోనే నడుస్తూ పేదలు కోర్టు కేసులు విషయంలో తన వద్దకు వస్తే న్యాయం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తున్నా.

చిలుముల ప్రతాప్‌రెడ్డి, హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్

చెప్పులు లేకుండా కాలినడకన..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాది జగిత్యాలలోని వీక్లీ బజార్. నేను మా అన్నయ్య నాగభూషణంతో కలిసి ఇంటి నుంచి కాళ్లకు చెప్పులు లేకుండా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న యూపీఎస్ పాఠశాలకు వెళ్లేవాళ్లం. మధ్యాహ్నం స్కూల్లో పెట్టే ఉప్మా తినేవాళ్లం. అక్కడే మాకు విలువలు, సంప్రదాయాలు, చదువు విలువలు నేర్పించారు. మా ఇంట్లో అందరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ముగ్గురం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాం.

– సరోజ, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి

తొలిరోజు అమ్మనాన్నలతో..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని ఖానాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నా విద్యాభ్యాసం ప్రారంభమైంది. మొదటగా అమ్మ సుశీల, నాన్న రంగారెడ్డి పాఠశాలలో చేర్పించారు. ప్రతీ రోజు నాన్న స్కూలు వద్ద దించేవారు. అక్కడే మా మిత్రులతో కలిసి సంతోషంగా విద్యాభ్యాసం చేశాను. క్రమం తప్పకుండా రోజూ పాఠశాలకు వెళ్లేవాడిని. అక్కడే మా భవిష్యత్‌కు పునాదులు పడ్డాయి.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

అప్పట్లోనే క్రమశిక్షణతో..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాది రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామం. అక్కడే ప్రభుత్వ పాఠశాలలో నా విద్యాభ్యాసం కొనసాగింది. మా తండ్రి ఆశయ్య, తల్లి రాజవ్వ నన్ను పాఠశాలలో జాయిన్ చేశారు. పాఠశాలలో క్రీడలు నేర్పించారు. స్కౌట్స్‌గైడ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అక్కడే నాకు క్రమశిక్షణ, సమయపాలన, పెద్దలను గౌరవించే పద్ధతులు అలవాటయ్యాయి. పట్టుదల, అంకిత భావంతో చదివి ఈ స్థాయికి ఎదిగా.

– మల్లేశం, మత్స్యశాఖ అధికారి

అన్నతో కలిసి వెళ్లా..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాది వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం నారాయణగిరి. అక్కడి ప్రభుత్వ పాఠశాలలో నా విద్యాభ్యాసం కొనసాగింది. అమ్మ వెంకటమ్మ, నాన్న లక్ష్మీనర్సింహారెడ్డి నన్ను పాఠశాలలో చేర్పించారు. మా అన్నయ్య జనార్దన్‌రెడ్డితో కలిసి ప్రతిరోజు బడికి వెళ్లేవాడిని. నా స్నేహితులతో కలిసి బాగా క్రీడలు ఆడేవారం. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించడం ద్వారానే సర్కార్ కొలువు సాధించా.

– మోహన్‌రెడ్డి, జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

2 కి.మీ. నడుచుకుంటూ వెళ్లేవాడిని



సంగారెడ్డి టౌన్: ''మాది సాధారణ కుటుంబం. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించాను. ప్రతిరోజు పాఠశాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లేవాడిని'' అని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి బి రమేశ్ అన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. సోషల్ టీచర్ చొరవతోనే బాగా చదివేవాడినన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ అని చెప్పారు.

– బి రమేశ్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి

న్యూస్‌రీల్

న్యూమటిక్ ప్లాంటర్‌తో ప్రయోజనాలెన్నో..

ఏరువాక శాస్త్రవేత్తలు విజయ్, పల్లవి



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

మర్కూక్(గజ్వేల్): న్యూమటిక్ ప్లాంటర్ సహాయంతో పత్తి విత్తుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏరువాక శాస్త్రవేత్తలు విజయ్, పల్లవి పిలుపునిచ్చారు. ఇప్పలగూడెం గ్రామంలో రైతులకు న్యూమటిక్ పద్ధతి పత్తిసాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కూలీల సమస్య పెరగడంతో పత్తిసాగు భారంగా మారిందన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తుకోవచ్చని, మొలక శాతం పెరుగుతుందని వివరించారు. మొక్కలు ఏపుగా పెరగకుండా మేపిక్వాట్ క్లోరైడ్ అనే మందు పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు అధికంగా హైబ్రిడ్‌రకం సాగు చేయడం వల్ల ఎకరానికి 4,938నుంచి 7,407 మొక్కల వరకు కాయడం వల్ల పంట కాలం పెరగడం, తద్వారా గులాబీరంగు పురుగు ఉధృతి ఎక్కువ కావడం వల్ల పంటలు ఆశించిన మేరకు రావడం లేదని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి, ఏఈఓలు రజినీకాంత్, విష్ణువర్ధన్, రైతులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్రూం'లపై రీసర్వే చేయించండి



మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన డబుల్ బెడ్రూంల ఇండ్ల పంపిణీపై రీ–సర్వే చేయించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య కోరారు. మంగళవారం హైదబాద్‌లోని సెక్రటేరియెట్‌లో డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌తో కలిసి మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఎంపిక తీరు సక్ర మంగా లేకపోవడం వల్ల ఎంతో మంది అర్హులకు అన్యాయం జరిగిందని వాపోయారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలోని కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ సుబ్బలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు www.iti.Teanfana.gov.inలో ఈ నెల 14లోగా దరఖాస్తులు చేసుకోవాలని, అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ ఐటీఐలలో ఎక్కువ ట్రేడులకు ఆప్షన్స్ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐ సిద్దిపేటలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, కోపా, మెకానిక్ డీజిల్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి



మాట్లాడుతున్న వీరస్వామి గౌడ్

హుస్నాబాద్: గీత కార్మికులు, మృతుల కుటుంబాలకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామి డిమాండ్ చేశాడు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం గీత కార్మికులను చిన్నచూపు చూసిందని ఆరోపించారు. అదే తప్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తే కార్మికుల ఆగ్రహానికి గురి కాక తప్పదన్నారు. గీత కార్మికులకు ఉచితంగా సేఫ్టీ మోకులు అందించే విధంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ చూపాలని కోరారు.

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

జహీరాబాద్: ప్రయాణికుల భద్రతే ముఖ్యమని, ఇందుకోసం 'మై ఆటో ఈజ్ సేఫ్' అనే కార్యక్రమం చేపట్టినట్టు డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని 400ఆటోలకు క్యూఆర్ కోడ్ ఉన్న స్టిక్కర్లను అతికించారు. అనంతరం మాట్లాడుతూ క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేస్తే డ్రైవర్ పూర్తి సమాచారం లభ్యమవుతుందన్నారు.

బడికి వేళాయే..

నూతన విద్యాసంవత్సరం నేటి నుంచి ప్రారంభం కానుంది. అందుకోసం విద్యాశాఖ అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పాఠశాలలను శుభ్రపరిచి, మామిడి తోరణాలు, పూలతో సుందరంగా అలంకరించారు. తొలి రోజే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు చేర్చారు. గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బడిగంటలు మోగనున్నాయి.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

- నేటి నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం
- ఉత్సాహంగా తరలిరానున్న విద్యార్థులు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ
- కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం



పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

జిల్లాలో 980 ప్రభుత్వ, 257 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 87,500 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల్లో 1,10,000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే బడిఈడు పిల్లలను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులు కొనసాగిస్తున్నారు. ఈ నెల 6నుంచి 20వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

తొలిరోజే పుస్తకాల పంపిణీ

నూతన విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, స్కూల్ యూనిఫామ్‌లు అందించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. పాఠశాలకు విద్యార్థులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా హాజరుకానున్నారు.



అడ్మిషన్ ఫామ్ అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

ముఖ్య అతిథులుగా ప్రజాప్రతినిధులు

పాఠశాలల్లో ప్రారంభ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడురులో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజాశర్మ, సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి హాజరుకానున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్



బడిబాటలో సెక్టోరియల్ అధికారి భాస్కర్

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీనగర్ పంచాయతీ మదిర గ్రామం ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి అన్ని వసతులు కల్పించడంతో పాటు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, స్కూల్ యూనిఫామ్స్, మంచి వాతావరణంలో విద్యా బోధన జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అర్జున్‌రావు, వెంకట్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ చిత్ర, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కవాతును విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ పిలుపు



మాట్లాడుతున్న దళిత నాయకులు

గజ్వేల్‌రూరల్: మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 7న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌లో మందకృష్ణ నేతృత్వంలో ఈ కవాతు నిర్వహించనున్నట్టు చెప్పారు. గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరుశురాం, యాదగిరి, కృష్ణ, రాములు, శ్రీహరిసింధు, స్వామి, రాములు, కర్ణాకర్, మహేష్ పాల్గొన్నారు.

పత్తి సాగుపై రైతులకు అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న రైతులు, అధికారులు

వట్‌పల్లి(అందోల్): అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా కలిగే లాభాల గురించి ఆదిలాబాద్ శాస్త్రవేత్త ప్రశాంత్ వివరించారు. మంగళవారం అందోల్ మండలం డాకూర్ రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతి ద్వారా పత్తిసాగు చేస్తే కలుపు, చీడ పీడల బెడద ఉండదన్నారు. మేపిక్వాట్ క్లోరైడ్(చమత్కార్) అనే మందును మూడుసార్లు పిచికారీ చేస్తే మొక్కకు కొమ్మలు ఎక్కువగా వచ్చి పత్తికాత ఎక్కువగా ఉంటుందని సూచించారు. జోగిపేట ఏడీఏ అరుణ, మండల వ్యవసాయ అధికారి విజయరత్న, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అన్నివిధాలుగా 'జహీరాబాద్' అభివృద్ధి

ఎంపీ సురేశ్ షెట్కార్



జహీరాబాద్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ సురేశ్ షెట్కార్

జహీరాబాద్: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలో విజయోత్సవ ర్యాలీ, సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిందేమీ లేదని ఆరోపించారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్ సైతం అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున అధిక నిధులు తీసుకొస్తానన్నారు. అంతకు ముందు పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు హన్మంత్‌రావు పాటిల్, గిరిజా షెట్కార్, ఖాజామియా, ఎంజీ రాములు, శుక్లవర్ధన్‌రెడ్డి, జి.అశోక్, కండెం నర్సింహులు, శాకీర్‌అలీ, సుధీర్‌కుమార్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ విక్రయం పేరుతో మోసం

రూ. 66 వేలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: బైక్ విక్రయం పేరుతో సైబర్ మోసం చేసిన ఘటనలో బాధితుడు నగదు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన వ్యక్తి ఒక సామాజిక మాధ్యమంలో మే 18న బైక్ అమ్మకానికి ఉందని, తక్కువ ధరకు ఇస్తానని తాను ఆర్మీకి చెందిన వ్యక్తి అని పోస్ట్ చేశాడు. అది నిజం అని నమ్మి అతడితో బాధితుడు మాట్లాడి ముందుగా రూ.1500, అనంతరం మిగతా నగదు చెల్లించాడు. మొత్తంగా రూ. 66 వేలు చెల్లించిన తర్వాత బైక్ ఎప్పుడు వస్తుందని అడగగా అటు వైపు నుంచి స్పందిన రాలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్, పటాన్‌చెరు పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

మెడపై గాయాలను గుర్తించిన పోలీసులు


బాలుడి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం కర్దనూర్ వైపు వెళ్లే సరీస్ రోడ్‌లో మంగళవారం గుర్తుతెలియని బాలుడి మృతదేహం కనిపించింది. డయల్ 100 ద్వారా సమాచారం తెలుసుకున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి, క్రైమ్ సీఐ రాజు, ఎస్ఐ వెంకట్ రెడ్డిలతోపాటు క్లూస్ టీం చేరుకొని పరిసరాలను పరిశీలించింది. బాలుడి మెడపై ఉన్న గాయాలను గుర్తించింది. బాలుడి వయసు 8 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగల బీభత్సం

- వరుల చోరీలతో ప్రజలు బెంబేలు
- రంగంలోకి దిగిన పోలీసులు


పడేసిన హుండీ

పటాన్‌చెరు టౌన్: దొంగలు బీభత్సం సృష్టించారు. వరుస దొంగతనాలతో ప్రజలను హడలెత్తించారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం రుద్రారంలో సోమవారం రాత్రి శివాలయంలో హుండీ, అర్ధ తులం బంగారాన్ని గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. అలాగే రాణి అనే మహిళకు చెందిన కిరాణా షాపులో ఉన్న రూ.లక్ష నగదు చోరీ చేశారు. ఆ సమయంలో ఆమె నిద్రిస్తుంది. మరో చికెన్ షాప్‌లో నుంచి టీవీని, బైక్‌ను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఆలయ అర్చకులు, కిరాణా షాప్ నిర్వాహకురాలు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూలీ మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విరేచనాలు, వాంతులు చేసుకొని ఓ కూలీ మృతిచెందిన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జరిగింది. కొల్లూర్ పోలీసుల కథనం ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన జటోమారో(45) జీవనోపాధి కోసం తెల్లాపూర్‌కు 4 నెలల క్రితం వలసొచ్చాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజ్‌పుష్ప లేబర్ క్యాంప్‌లో ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా మంగళవారం తెల్లవారుజామున అతడు విరేచనాలు, వాంతులు చేసుకొని స్పృహ తప్పి కింద పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు మంగళవారం ఉదయం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


గవర్నర్ రాధాకృష్ణన్‌తో పట్టాలు అందుకున్న విద్యార్థులు


విక్టరీ గుర్తు చూపుతున్న విద్యార్థులు


గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థిని మాళవిక

చదువులమ్మ ఒడిలో.. భవిత మార్చుకుందాం

కనుల పండుగగా హార్టికల్చర్ వర్సిటీ స్నాతకోత్సవం

కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ స్నాతకోత్సవ సంబరం అంబరాన్ని అంటింది. విద్యార్థులు పట్టాలను పొందిన సందర్భంగా ఇక్కడి వాతావరణం సందడిగా కనిపించింది. వారు చేస్తున్న అల్లరి ఆహూతులను అలరించింది. కేరింతలు, చప్పట్లు, విజిల్స్ మోతతో ఆడిటోరియం మారుమోగింది.

గజ్వేల్/ములుగు: వారంతా అండర్ గ్రాడ్యుయేట్‌లు, పీజీ గ్రాడ్యుయేట్‌లు, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులు. ఇన్నాళ్లు కష్టపడి సాధించిన పట్టాలు స్నాతకోత్సవం రోజున పొందుతున్న సందర్భంలో ఆనందంలో మునిగారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఈ కార్యక్రమానికి హాజరుకావడంతో వారి ఆనందాన్ని రెట్టింపు చేసింది. ములుగు కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీలో మంగళవారం సందడి కనిపించింది. వర్సిటీ మూడో స్నాతకోత్సవం సంబరాన్ని పక్కనే ఉన్న ఫారెస్ట్ కాలేజ్ అండ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్ఎస్ఆర్ఐ) ఆడిటోరియంలో నిర్వహించారు. ఉదయం 11గంటలకు గవర్నర్



గవర్నర్ రాధాకృష్ణన్ చేతుల మీదుగా పట్టా తీసుకుంటున్న రోహిత్

సీపీ రాధాక్రిష్ణన్ వర్సిటీ చాన్స్‌లర్ హోదాలో హాజరయ్యారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం ఆడిటోరియంలోకి ప్రవేశించారు. సంప్రదాయం ప్రకారం గవర్నర్‌ను గౌరవంగా వేదిక వద్దకు తీసుకెళ్లారు. ఆ తర్వాత వర్సిటీ వైస్ చాన్స్‌లర్ నీరజా ప్రభాకర్ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఆ తర్వాత తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ గీతాలక్ష్మీ ప్రసంగం, చివరగా గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రసంగం కొనసాగింది.

పట్టాలు, బంగారు పతకాలు ప్రదానం

స్నాతకోత్సవంలో 156 మంది హార్టికల్చర్ డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి హార్టికల్చర్ పీజీ, 30 మందికి ఫారెస్ట్ పీజీ, మరో ఆరుగురికి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. వివిధ కోర్సుల్లో అత్యధిక జీపీఏ సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను సైతం ప్రదానం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, వర్సిటీ రిజిస్ట్రార్ భగవాన్, డీన్ డాక్టర్ ఎం. రాజశేఖర్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ కిరణ్, డీఎస్ఏ డాక్టర్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాసన్, హార్టికల్చర్ కమిషనర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థులు

హార్టికల్చర్ అధికారినవుతా



బీఎస్సీ(హార్టికల్చర్)లో అత్యధిక జీపీఏ సాధించినందుకు యూనివర్సిటీ నుంచే కాకుండా, మరో రెండు బంగారు పతకాలు రావడం ఆనందాన్ని ఇచ్చింది. ఇదే స్ఫూర్తితో ఉద్యాన రంగంలో మరింతగా పట్టు సాధించి హార్టికల్చర్ అధికారిగా స్థిరపడాలనే లక్ష్యం. ఆదిశగా ముందుకు సాగుతాను.

– ఆర్.వరలక్ష్మి, అండర్ గ్రాడ్యుయేట్, గద్వాల

సైంటిస్ట్‌గా సేవలందిస్తా

ఎంఎస్సీ(హార్టికల్చర్–వెజిటబుల్ సైన్స్)లో నాకు యూనివర్సిటీ నుంచే కాకుండా ప్రమీల జీవన్‌రాజ్ మెమోరియల్ ట్రస్ట్, గంగుభాయ్ మెమోరియల్ ట్రస్ట్ నుంచి బంగారు పతకాలు పొందడం సంతోషాన్ని ఇచ్చింది. హార్టికల్చర్ సైంటిస్ట్‌గా స్థిరపడాలన్నదే నా లక్ష్యం.

– మిట్టపల్లి మాళవిక, వరంగల్

కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటా



ములుగులోని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ(హార్టికల్చర్) కోర్సులో చేరడం సంతృప్తినిచ్చింది. పట్టుదలతో కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటా. తల్లిదండ్రులు, గురువుల సహకారం మరిచిపోలేనిది.

– స్వర్గం అఖిల, గ్రాడ్యుయేట్, గజ్వేల్

నా భర్త అదృశ్యమయ్యాడు..

- అందుకు కారణం లారీ యజమానేనని భార్య, పిల్లల ఆరోపణ


లారీ ఓనర్ కనకయ్య ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న శ్రీకాంత్ భార్య, పిల్లలు, బంధువులు

మద్దూరు(హుస్నాబాద్): లారీ క్లినర్ అయిన తన భర్త తమిళనాడులో లోడు దించడానికి వెళ్లి అదృశ్యమయ్యాడని, దానికి కారణం లారీ ఓనరేనంటూ బుధవారం అతడి భార్య కవిత, పిల్లలు ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ''మర్మాముల గ్రామానికి చెందిన లారీ ఓనర్ బత్తిని కనకయ్య వద్ద లారీ క్లినర్‌గా తన భర్త శ్రీకాంత్ పనిచేస్తున్నాడని అన్నారు. లారీ డ్రైవర్ పూర్ణచందర్‌రెడ్డితో కలిసి తాను మే 3న తమిళనాడు నాంకల్ జంక్షన్లో లోడ్ దించి రావాలని చెప్పాడని అన్నారు. ఇద్దరూ కలిసి తమిళనాడుకు వెళ్లారని తెలిపారు. మే 7న గ్రామానికి లారీ డ్రైవర్ ఒక్కడే తిరిగొచ్చారని పేర్కొన్నారు. దీంతో ఈనెల 8న పూర్ణచందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి తన భర్త ఎందుకు రాలేదని అడిగానని, దీంతో శ్రీకాంత్ తన వద్ద రూ. 200 తీసుకొని ఎక్కడికో వెళ్లిపోయాడని చెప్పారన్నారు. ఆందోళనకు గురైన తాను బంధువులతో కలిసి తమిళనాడుకు వెళ్లి, అక్కడ పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశానన్నారు. అక్కడ అతడి ఆచూకీ తెలియకపోవడంతో తిరిగి గ్రామానికి చేరుకున్నామన్నారు. మే 15న మద్దూరు పోలీసులకు భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేశానన్నారు. ఇప్పటికీ కేసు నమోదు చేసి నెల రోజులు గడుస్తున్నా భర్త జాడ తెలియరాలేదన్నారు. చేసేది లేక తన ఇద్దరు కొడుకులు, బంధువులతో కలిసి తాను.. మర్మాములలో లారీ ఓనర్ బత్తిని కనకయ్య ఇంటి ఎదుట ఆందోళన చేశామని తెలిపారు. భర్త ఆచూకీ తెలపకుంటే పిల్లలతో కలిసి ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొన్నారు. కనకయ్య, కవిత, బంధువుల మధ్య కొంత గొడవ జరుగగా ఇక్కడికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలకు నచ్చ చెప్పి చేర్యాల సీఐ శ్రీను వద్దకు తీసుకెళ్లారు.

కరాటేతో శారీరక దృఢత్వం


కరాటే ఎగ్జామ్స్‌లో బెల్టులు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

మెదక్ మున్సిపాలిటీ: కరాటే నేర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వంతోపాటు ఆత్మ విశ్వాసం పెరుగుతుందని రెంజుకి షోటోకాన్ స్పోర్ట్స్ అకాడమీ ఆఫ్ ఇండియా ఫౌండర్ మాస్టర్ నగేశ్ పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో యువతులకు ఈ శిక్షణ ఎంతో అవసరమన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని గుల్షన్‌క్లబ్‌లో రెంజుకి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్టు ఎగ్జామ్ నిర్వహించారు. 50 మంది పాల్గొనగా నగేశ్ మాస్టర్ ఎగ్జామినర్‌గా, విద్యాసాగర్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఉత్తీర్ణత సాధించిన వారికి బెల్టులు అందజేశారు. అనంతరం మాస్టర్ నగేశ్ మాట్లాడుతూ కరాటే ఎస్‌జీఎఫ్ఐ, యూనివర్సిటీ, ఆసియా, ఒలింపిక్‌లో కూడా కరాటే ఉందన్నారు. కార్యక్రమంలో సిరి, అబ్దుల్లా, అంకిత్, విశిష్టరాజ్, స్వరూప్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న టీఎన్‌జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉద్యోగులకు అండగా ఉంటామని టీఎన్‌జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండల విక్రమ్‌రెడ్డి భరోసానిచ్చారు. బుధవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కార్యవర్గం సమావేశం పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఎన్నికలను సజావుగా నిర్వహించిన ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. తమను ప్రోత్సహిస్తున్న కలెక్టర్ మనుచౌదరికి కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బకాయిలు డీఏలను విడుదల చేయాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మారం రాజేశ్వర్‌కు సిద్దిపేట సంఘం తరపున అభినందనలు తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. తెలంగాణ ఉద్యోగులకు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. బకాయిలున్న పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగుల బదిలీలు చేపట్టాలన్నారు. ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన ఉద్యోగులను తిరిగి తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. సమావేశానికి సిద్దిపేట జిల్లా టీఎన్‌జీఓఎస్ సహాధ్యక్షుడు నిమ్మ సురేందర్‌రెడ్డి, కోశాధికారి అశ్వక్ అహ్మద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పెళ్లి సంబంధాలు కుదరడం లేదని..

మనస్తాపంతో ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


ధన్‌రాజ్(ఫైల్)


శివ్వంపేట(నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందులతోపాటు పెళ్లి కుదరడం లేదని మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి దొంతిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కక్కబోయిన ధన్‌రాజ్ (25) ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. కొన్నేళ్ల నుంచి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. పైగా పెళ్లి సంబంధాలు కుదరడం లేదు. ఈ విషయమై మనస్తాపం చెందిన అతను సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చే సరికి విగతాజీవిగా కుమారుడు కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఇదివరకే రెండు సార్లు ఆత్మహత్యాయత్నాలు చేశాడన్నారు. తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హైనా దాడిలో రెండు మేకల మృతి


హైనా దాడిలో మృతి చెందిన జీవాలు, గాయపడ్డ దూడ


చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో రెండు జీవాలు మృతిచెందగా దూడకు గాయాలయ్యాయి ఈ సంఘటన మండల పరిధిలోని చంద్లాపూర్ సోమవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాలింగి వెంకటయ్య రోజు మాదిరిగా తన వ్యవసాయ పొలం వద్ద రెండు జీవాలు(మేకలు), దూడను పాకలో కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లే సరికి రెండు జీవాలు మృతిచెంది ఉన్నాయి. దూడకు గాయాలయ్యాయి. రెండు మేకలు మృతిచెందడంతో రూ. 25 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు. కాగా, హైనాను పట్టుకోవడం కోసం అటవీ శాఖ అధికారులు కెమెరా ట్రాప్, బోన్‌లు ఏర్పాటు చేశారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

పిడుగుపాటుకు ఆవు..


ఆవు కళేబరం వద్ద రైతు కనకయ్య

సిద్దిపేటరూరల్: పిడుగుపాటుకు గురైన ఆవు మృతిచెందిన ఘటన నారాయణరావుపేట మండల పరిధిలోని మల్యాలలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బండారి కనకయ్య రోజూలాగే ఉదయం ఆవును వ్యవసాయ బావి వద్ద కట్టేసి వచ్చాడు. మధ్యాహ్నం వర్షం కురిసింది. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో మృతిచెందింది. రూ.70 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు కనకయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

ఎద్దు కూడా...


ఎద్దు కళేబరం వద్ద రైతు రంగయ్య

చేర్యాల(సిద్దిపేట): పిడుగుపాటుకు గురైన కాడెద్దు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని తాడూరులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు వడ్లకొండ రంగయ్య తన రెండు కాడెద్దులను మంగళవారం సాయంత్రం పొలంలోకి మేపేందుకు తీసుకు వెళ్లాడు. ఆసమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడం మొదలై ఆ వెంటనే పిడుగు పడింది. దీంతో కాడెద్దు అక్కడికక్కడే మృతిచెందింది.

ఏసీ ఫిట్టింగ్‌కు వస్తే .. ప్రాణం పోయింది!

రెండో అంతస్తు నుంచి పడి ఏసీ టెక్నీషియన్ మృతి

పటాన్‌చెరు టౌన్: రెండో అంతస్తు పై నుంచి పడి ఏసీ టెక్నీషియన్ మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కుర్షిత్ అలీ కథనం ప్రకారం... రామచంద్రాపురం మండలం శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన సతీశ్ (40) ఏసీ టెక్నీషియన్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రణీత్ ప్రణవ్ నైట్ వుడ్‌లో ఓ ఇంటికి ఏసీ ఫిట్టింగ్ కోసం వచ్చాడు. రెండో అంతస్తులో ఫిట్టింగ్ చేస్తూ కింద పడి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంటి యజమాని శ్రీకాంత్ ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతోనే సతీశ్ మృతిచెందాడని మృతుడి సోదరుడు ఈశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి సెలవులకొచ్చి..

- కన్నవారికి కడుపుకోత మిగిల్చి..
- స్విమ్మింగ్ పూల్‌లో మునిగి యువకుడి మృతి


గిరీశ్ (ఫైల్)

సిద్దిపేటకమాన్: మేన బావతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో మునిగిపోయి మృతిచెందాడు. ఈ సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక లింగారెడ్డిపల్లికి చెందిన టేకుపల్లి జాన్‌బాబు, సందీపల పెద్ద కుమారుడు గిరీశ్ (17) బాసర ట్రిపుల్ ఐటీలో చదువుకుంటున్నాడు. కాగా ఇటీవలే సెకండియర్ పూర్తి చేసుకొని వేసవి సెలవుల్లో ఇంటికొచ్చాడు. కొద్ది రోజులుగా దగ్గరలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లేవాడు. మంగళవారం సాయంత్రం కూడా మేనబావ సాయికిరణ్‌తో కలిసి తాను స్విమ్మింగ్‌కు వెళ్లాడు. అక్కడ ఇద్దరూ కలిసి ఏడు ఫీట్ల లోతు ఉన్న పూల్‌లో దూకగా సాయి ఈదుకుంటూ ముందుకెళ్లాడు. వెనక గిరీశ్ కనబడలేదని వచ్చి చూసేసరికి నీటిలో మునిగిపోయి కనిపించాడు. వెంటనే అతడిని పైకి తీసి సీపీఆర్ చేశాడు. అనంతరం బైక్‌పై సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతలకు 6 నెలల జైలుశిక్ష

పటాన్‌చెరు: ముగ్గురు గంజాయి విక్రేతలకు 6 నెలల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమానాను విధిస్తూ సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారు. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం.. 2018 జనవరి 20న పటాన్‌చెరు పరిధిలో విస్లావత్ శెట్టి నాయక్, విస్లావత్ మోహన్, గడ్డం రామ్ నవీన్ గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి అదుపులో తీసుకున్నారు. వారి నుంచి 20 కిలోల గంజాయితో పాటు బైక్‌ను సీజ్ చేసి అప్పుట్లో కేసు నమోదు చేశారు. మంగళవారం సంగారెడ్డి కోర్టులో ఫస్ట్ క్లాస్ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ న్యాయమూర్తి జయంతి ఈ కేసులో గంజాయి విక్రేతలకు పై విధంగా తీర్పు చెప్పినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

గాయపడిన మరో మహిళ...

ఆర్టీసీ అద్దె బస్సు, బైక్ ఢీకొన్న ఉదంతం


స్వరూప(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆర్టీసీ ప్రైవేటు అద్దె బస్సు, బైక్ ఢీకొన్న ఉదంతంలో గాయపడిన మహిళ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. పంతుల్‌తండా క్రాసింగ్ మలపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కరంటోతు రాజు భార్య స్వరూప(38) వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. భర్త రాజు హాస్పిటల్‌లోనే చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి కూడా సరిగ్గా ఉండటం లేదని, ఒక్కొక్కసారి మాట్లాడం లేదని తండావాసులు చెబుతున్నారు. ఇప్పటికే ఈ ప్రమాదంలో తండావాసి కరంటోతు కవిత చనిపోవడం తెలిసిందే. ఇప్పుడు స్వరూప మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉదయం కవితకు.. సాయంత్రం స్వరూపకు అంత్యక్రియలు జరిగాయి. రెండురోజుల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

పిడుగు పాటుకు 12 గొర్రెల మృతి



దుబ్బాకరూరల్: పిడుగు పాటుకు 12 గొర్రెలు మృతిచెందిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిన్న నిజాంపేటలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన కోనపురం పెంటయ్య రోజు మాదిరిగానే గొర్రెలను మేపడానికి తోలుకెళ్లాడు. మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి గొర్రెల మందపై పిడుగు పడింది. దీంతో 12 అక్కడికక్కడే మృతిచెందాయి. దీంతో రూ. 1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.